



మహాకవి కాళిదాస విరచితమైన మహోదాత్త ప్రేమ గాథ "పురూరవ వూర్వశి" నృత్య నాటిక సంస్కృతంలో ప్రదర్శించ బడుతోంది.

దివి నుండి భువికి దిగి వస్తున్న దేవకన్య వూర్వశి, ఆమె చెలి కత్తెలు.

రాక్షసి కేశి వాత వద్ద వూర్వశిని, చిత్రలేఖను రక్షించమని పురూరవుణ్ణి చెలికత్తెలుఅర్థించడమూ—

వూర్వశీ—పురూరవులు ఒకరిపై ఒకరు మరులు గొని విడదీయరాని ప్రణయబంధంలో చిక్కడ్డం—

ఈ లోగా దేవాంగనలు దివికి తిరిగి రావలసిందిగా పిలుపు అందడంతో వూర్వశి పురూ రవు లిరువురూ ఎడబాటు సహించలేక విరహవేదనతో వేగిపోవడము—

చెలులతో దివి కేతించిన వూర్వశి, భరతమునిచే రూపొందించబడ్డ నాట్య రచనా ఘట్టాన్ని అభిన యిస్తుండగా, ఆమె నోట పురూరవుడి పేరు వెలువడ్డం—

భరతముని వూర్వశికి దేవలోకార్హత లేదని శపించడమూ—

దేవేంద్రుడు శాపవిమోచన రీతి వెల్లడించడము—

కొన్ని వత్సరాల వరకూ వూర్వశీ పురూరవుల నిరాటంకమైన ప్రేమైక జీవితము—

వూర్వశి అలక, ఎడబాటు పాత్రలనూ, పాత్రధారు లనూ చూస్తుంటే అభినయించబడుతూన్న నృత్య నాటికగా అనిపించలేదు. ముఖ్యంగా ప్రేమరసం, శౌర్యరసం అభినయిస్తున్న పురూరవుని కన్నా,, విరహవేదన నభినయిస్తున్న అతడి తీరు శ్రీకాంత్‌ను ఆకట్టుకుంది.

కిరీటం లేకుండా చింతాకాంత్రుడై వేయి కన్ను లతో నింగినీ నేలనూ వెదకుతూ హృదయ వేదనను భావ ప్రకటనతో వెల్లడించే అతడి మోము శ్రీకాంత్ హృదయ పీఠికపై చెరగని ముద్ర వేసింది.

ముఖానికే వన్నెకూర్చే కొసతేలిన అతడి మీసాలూ, తీర్చిదిద్దిన ముక్కూ! విల్లునే ధిక్కరించే ఆ బొమలు! అతి సహజంగా అమరిన గిరిజాల జుట్టు! ఆ పాత్రదారి ప్రతి కదలికలో పురూరవు డంటే ఈలా ఉండేవాడా? అన్నట్టు భ్రమ గొలుపుతూంది. చవ్! కాస్త పొడ గరి అయి ఉంటే పురూరవుడు మరీ అందగాడై ఉండేవాడు.

ఆలోచనలో పడి కొట్టుకు పోతున్న శ్రీకాంత్ నృత్య నాటిక ముగియడంగానీ, ఆడిటోరియంలో లైట్లు వెలగడం కానీ చూడలేదు. అదో రసమయ భావోద్వేగంలో కొట్టుకు పోతూందాతడి మనసు!

"మూన్‌లైట్ డిన్నర్" రోజా గార్డన్‌లో ఎదురు చూస్తూందని, డెలిగేట్స్ కాకుండా నృత్య నాటికను చూడ వచ్చిన ప్రతి ఒక్కరూ అక్కడికి ఆహ్వానితులే నని, ఆహ్వాన సంఘ అధ్యక్షులు శ్రీ రావుగారు వెల్లడించడంతో కరతాళ ధ్వను లొక్కసారి మారు

మోగాయి.

గత నాలుగు రోజులుగా అంతర్జాతీయ స్థాయిలో బెంగుళూరులోని ఒకానొక సంస్థలో జరిగిన నూనె విత్తుల సెమినారులో పాల్గొనేందుకు వెళ్ళిన డెలిగేట్స్‌లో శ్రీకాంత్ ఒకడు. డాక్టరేట్ డిగ్రీ పుచ్చుకుని 'పీనట్స్'పై పరిశోధన అతడి వృత్తి.

పగలంతా సెమినార్లు, చర్చలు, పేపర్లు సబ్మిట్ చేయడం లాంటి కార్యకలాపాలతో గడిచి పోయేది. సాయంత్రాల్లో అలా అలా ఒంటరిగా వెళ్ళి ఏ లాల్‌బాగ్‌లోనో, పబ్లిక్ పార్కులోనో, మరే ఇతర సుందర ప్రదేశంలోనో కూర్చుని ప్రకృతిని ఆస్వాదించడం అతడి దిన చర్య! ఆ వేళే ఆఖరి రోజు. రేపటినుండీ ఎవరి దారి వారిది!

పురూరవ పాత్రధారిని కలుసుకుందుకు వీలు పడలేదన్న నిరాశ ఎదనిండా అలముకుంది. మన సెందుకో ఆ రూపం చుట్టూ పరిభ్రమిస్తూంది.

పాలార బోసిన వెన్నెల! రోజా గార్డెను మధ్య లాన్స్‌లో బల్లల మీద అమర్చిన బఫె స్టాలు ఉన్నారు! ఎవరికి కావలసిన పదార్థాలు వారు వడ్డించుకుని దూరంగా వేసిన కుర్చీల మీద ఆసీనులై తినడాని కుపక్రమిస్తున్నారు.

రెండవ సారి పదార్థా లుంచిన బల్ల దగ్గరకు వెళ్ళిన శ్రీకాంత్, బల్ల కావైపున తల వంచుకుని వడ్డించు కోవడంలో నిమగ్నమైన యువతిపై కళ్ళు కేంద్రీకరించాడు.

పెద్ద పెద్ద నొక్కుల జుట్టు, భుజాలు దిగని జడ! అందమైన కోల ముఖం, అల్చిప్పల్లాటి కళ్ళు—అతి నాజూకైనా విగ్రహం! గులాబీ దేహచ్ఛాయ!

తను ఎన్నో సంవత్సరాలుగా వెతుకుంది ఈలాటి అమ్మాయి కోసమే అనిపించింది! తన అన్వేషణ ఇన్నాళ్ళకు ఫలించిందా అనిపించి సభ్యత కూడా మరచి కళ్ళప్పగించాడు శ్రీకాంత్.

పక్కనే ఉన్న గుంపులో నుండీ—"చాలా ఆలస్యంగా వచ్చారేం శరత్‌రేఖా!" అంటూ పలకరించాడు.

కన్నడ, ఇంగ్లీషు భాషలలో సాగుతూంది అక్కడ సంభాషణ.

"రంగులూ అవీ తుడిచేసుకు వచ్చేసరికే ఆలస్యమవుదూ?" అంటున్నారెవరో.

వారంతా ఒకరినొకరు బాగా ఎరిగున్న వారిలా తోచారు వారి మాటలబట్టి.

"ఇప్పటికి నాలుగుసార్లు చూశాను పురూరవుడిగా నీ అభినయం! ఎప్పటికప్పుడు కొత్తగానే తోస్తావు!"

శరత్‌రేఖ అని పిలవబడ్డ ఆ అమ్మాయి తల వంచి బిడియంగా నవ్వి పళ్ళెంలోని పదార్థాలతో ముందుకు సాగిపోయిందే కానీ పెదవి విప్పి ఒక చిన్న పలుకైనా పలుకలేదు.

ఆ నవ్వును గుండెల్లో పదిల పరచుకుని పురూరవ వేషధారి ఈ నాజూకైన అమ్మాయా? ఆశ్చర్యంతో తల మున్కలయ్యాడు శ్రీకాంత్.

"శరత్‌రేఖ" మనసులో మననం చేసుకున్నాడు.

అంతలో విదేశీ డెలిగేట్స్ పలుకరించడంతో తాత్కాలికంగా ఆలోచన విరమించుకుని వారితో చర్చలో మునిగిపోయాడు శ్రీకాంత్.

దూరంగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడు రావుగారు "హలో! ఎవ్రిబడీ కంఫర్టబుల్! హెల్ప్ యువర్ సెల్వ్స్ లిబరలీ!" అంటూ అందరినీ హెచ్చరిస్తూ ఆటుగా వచ్చాడు.

విదేశీ డెలిగేట్లు, మరెవరో సైంటిస్టులు తారసపడితే వారటు మాటల్లో మునిగి పోవడంతో శ్రీ కాంత్ ఒక్కడే మిగిలిపోయాడు!

"హలో శ్రీకాంత్! ఎమైనా వడ్డించుకున్నారా లేదా?" అంటూ తనూ ఒక పళ్ళెంలో కావలసిన పదార్థాలు వడ్డించుకుని —"రండి! అలా కూర్చుందాము!" అంటూ రణగొణధ్వని తప్పించుకుని కాస్త ఎడంగా ఉన్న బల్ల దగ్గర ఆశీనులయ్యారు.

"మీరే ఆలస్యం సార్! నేను సెకెండ్ రవుండ్ కూడా పూర్తి చేశాను!" అన్నాడు శ్రీ కాంత్.

రావుగారు తెలుగువారు. పైగా వయసులో పెద్దవారవడంతో శ్రీ కాంత్‌తో ఆప్యాయంగా తెలుగులోనే మాట్లాడేవారు గతనాలుగు రోజుల నుండీ కూడా.

కాసేపు పదార్థాల రుచి మీద సాగింది సంభాషణ. ఆపైన శ్రీ కాంత్—"వారవగా సార్! మీరు డాన్స్ డ్రామా పాత్రధారులను పరిచయం చేసి ఉంటే చాలా అప్రోప్రియేట్‌గా ఉండేది!" అన్నాడు.

"వారంతా ఇక్కడ ఇన్‌స్టిట్యూట్‌లో పని చేసే గర్ల్స్ సెహోయ్! ఆర్కెస్ట్రా కూడా ఇక్కడి సిబ్బందే! గత మూడుసార్లు! ఆడిటోరియంలో పర్ఫార్మెన్స్ ఇచ్చారు మొదటి సారి మాత్రం 'ఫ్లా' అయింది. కొంత గౌరవం నిలిచింది అంటే అది పురూరవ వేషధారణవల్లే! ప్రతిసారీ ఆ అమ్మాయిలో కొంగ్రొత్త భావ ప్రకటనలూ, యాక్షనులో మెచ్యూరిటీ అపుపిస్తూంది అంటే అది అతిశయోక్తి కాదు!"

"ప్రాక్టీస్ మేక్స్ పర్ఫెక్ట్ కదండీ!" అందుకున్నాడు శ్రీకాంత్.

"ప్రాక్టీసే కాదోయ్! ఆ అమ్మాయిలకి నాచురల్ టాలెంట్ ఉంది! చూశావుగా! పురూరవుడిగా ఆమె చూపించిన హావ భావ ప్రకటనం! శౌర్యం ప్రేమ విరహ రసాలను ఎంత సహజంగా




అభినయించిందో, నిజంగా పురూరవుడే అయినా అంతలా ప్రకటించి ఉండేవాడు కాదేమో! అన్నట్టు ఆ డాన్స్ డ్రామా ట్రూప్ ఇంతకుముందే భోజనానికి వచ్చారే! చూశారా?" తలెత్తి అక్కడి గుంపులవెంట కళ్ళు పరుగెట్టించి కాస్త అవతలగా కూర్చొని ఏవో కబుర్లు చెప్పుకొంటూ భోంచేస్తున్న గుంపు కేసి చూపి "అదిగో అంతా ఇక్కడే ఉన్నారు! పోనీ... మీ కంత ఉబలాటంగా ఉంటే ... రా! ... అందరినీ పరిచయం చేస్తాను!" ఒక్క ఉదుటున లేవ బోయారు రావుగారు!

మొహమాటపడుతూ "అబ్బే! అవసరంలేదండీ!" అంటూ వారించాడు శ్రీకాంత్.

నాప్‌కిన్‌తో మూతి తుడుచుకుంటూ "నిజం చెప్పాలంటే! పురూరవుడి వేషం వేసిందే ఆ పిల్ల అమోఘమైన ఆర్టిస్టు! చక్కటివాళ్ళురు. పసితనంలో వాళ్ళ వాళ్ళు పాట, డాన్సు పరదాకు నేర్పించారట! పెళ్ళయ్యాక అన్నీ మూలపడ్డాయనుకో! మంచి అణకువ గల పిల్ల. పేరుకు తగ్గ అందం! శరత్ రేఖ కానీ గొప్ప దురదృష్టవంతురాలోయ్ . . .పెళ్ళయిన ఆరునెలలకే అన్నీ ముగిసిపోయాయి!" చెప్పడం ఆపి మంచినీళ్ళు తాగారు రావుగారు. "అంటే! . . ." సందేహంగా రావుగారి ముఖంలోకి చూశాడు శ్రీకాంత్!

"పసుపు కుంకుమలు కోల్పోయి పుట్టింట చేరింది. రిసెప్షనిస్ట్‌గా ఇదే ఇన్‌స్టిట్యూట్‌లో వర్క్ చేస్తోంది గత ఐదు సంవత్సరాలుగా! . . . మొదట్లో చాలా డల్‌గా ఉండేది. నేనే ఎంతో నచ్చచెప్పి ప్రోత్సాహమిచ్చేవాడిని . . . కాస్త ఈ ఈలా ఏదైనా కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటూంది!"

శ్రీకాంత్ మనసంతా ఎవరో కలచివేసినట్టు అనుభూతి చెందాడు! . . . శరత్ రేఖ . . . . శరత్ రేఖ అంటూ మూగ సహజమైన సానుభూతితో మూలిగిందాతడి మనసు.

రాత్రంతా సరిగా నిద్ర పట్టక పక్కమీద అశాంతి గా దొర్లాడు శ్రీ కాంత్! . . .అతడి మనసు ఇది అని అతనికే తెలియని ఆవేదన చుట్టు ముట్టి కదలిపోయింది.

తెల్లవారు ఝామునుండి హాస్టల్స్‌లోని డెలిగేట్సు తిరుగు ప్రయాణానికిసంసిద్ధులై ఒక్కొక్కరే ఖాళీ చేసి వెళ్ళిపోసాగారు.

ఆ సాయంత్రానికి తన ఫ్లైట్! . . . అప్పటిదాకా ఏం చేయాలో తోచని శ్రీ కాంత్ వెంట తెచ్చుకున్న "అటాచీ" బ్రీఫ్‌కేస్ సర్ది . . . శ్రద్ధగా ముస్తాబయ్యాడు. ఫుల్‌వైట్‌షర్టు, కాఫీ కలర్ పాంటులోకి నీటుగా టక్ చేసి ఫుల్ సూ ధరించాడు. "అన్‌రూలీ"గా ఫాల భాగా నాక్రమించిన ఉంగరాల జుట్టుకి బ్రిల్‌క్రీమ్ పట్టించి వెనక్కుదువ్వి, లైట్‌గా క్రీమ్, పౌడర్ పట్టించాడు ఎంతసేపు స్లో మోషన్‌లో చేసినా కాలం గడిచేటట్టు అనిపించ లేదు.

. . .గది లాక్ చేసి అలా ఇన్‌స్టిట్యూట్ వైపు బయలుదేరాడు.

అతడి కాళ్ళు మెయిన్ కౌంటర్ దగ్గరగా తెచ్చి దిగ విడిచాయి.

గ్లాస్‌డోర్స్ నుండి అవుపిస్తున్న మూర్తి మీదే కళ్ళు నిలిచాయి! ఆమె . . . శరత్ రేఖ! .

"మే ఐ హెల్ప్ యూ! . . . ." అంది యధా లాపంగా ఆమె! . . . .

"సర్టెన్లీ!... అంటూ" ఒక కుర్చీ లాక్కుని నింపాదిగా కూర్చున్నాడు.

తలెత్తి అతడు చెప్పబోయే విషయాన్ని జాగ్రత్తగా వినడానికన్నట్టు అతడి ముఖంలోకి చూచింది శరత్ రేఖ.

క్షణ కాలం ఆమె సోగకళ్ళలో కళ్ళుంచి "రాత్రి మీ నటన సూపర్బ్‌గా ఉంది! . . . . అభినందించడానికి వచ్చాను! . . . బైదబై . . . నాపేరు డాక్టర్ శ్రీ కాంత్ ఫ్రమ్ హైదరా బాద్!"

ముఖంలో అప్పటి దాకా ఉన్న ప్రసన్నత కాస్త మాయమైంది! . . . . "థ్యాంక్యూ వెరీ మచ్ ఫర్ ద కాంప్లిమెంట్స్!" బదులిచ్చింది శరత్ రేఖ.

ఆ తరవాత ఏం మాట్లాడాలో ఎలా సంభా షణ సాగించాలో తెలియలేదు శ్రీ కాంత్‌కు

అతడి అవస్థ చూచి . . . లోలోపలే నవ్వు కుంది శశిరేఖ! . . . అతడి తిరుగు ప్రయాణం గురించి వాకబు చేసి అతడిలోని బిడియాన్ని కొంత వరకూ పోగొట్టింది

ఏదో చెప్పాలని, మరింకేదో మాట్లాడాలని శ్రీ కాంత్ మనసు ఉవ్విళ్ళూరుతున్నా అన్నీ వెనక్కు నెట్టి గుడ్‌బై చెప్పి బైటపడ్డాడు శ్రీకాంత్ . . . .

* * * *

నాలుగు మాసాల అనంతరం . . . అదే ఇన్‌స్టిట్యూట్‌కు పనిమీద పది రోజుల టూర్‌లో బెంగుళూరు వచ్చాడు శ్రీ కాంత్.

కాసేపు డిపార్టుమెంటులో పని చూసుకుని మెయిన్ బిల్డింగ్ కేసి నడిచాడు శ్రీ కాంత్. చాలా రోజుల తరవాత శరత్ రేఖను కలుసుకో బోతున్నందుకు మనసులో ఏదో ఉద్విగ్నత చోటు చేసుకుంది.

కౌంటర్‌లో నుంచున్న వ్యక్తి చూచి "మే ఐ హెల్ప్‌యూ" అని యధాలాపంగా పలుకరించింది శరత్ రేఖ!

"ఎస్ మేమ్! . . . యూమస్ట్ కమ్ అండ్ ఫ్రెండ్ సమ్ టైమ్ విత్ మీ ఇన్ ద కెంటీన్ . . ." అరోగెంట్‌గా బదులిచ్చాడు శ్రీ కాంత్ . .

"వ్హాట్?..." అంటూ కోపంగా తలెత్తి చూచి—,

"వై షుడ్ ఐ?" అంది ముక్కుపుటా లదర.

"బికాస్ ... ఐ ... యామ్ ... యువర్ ఫాన్!" నత్తి పలికాడు.

"ఆర్ యూ క్రేజీ ..." తల తిప్పేసుకుంది శరత్ రేఖ.

"మర్చిపోయారా మేమ్! నేను శ్రీకాంత్‌ని! మీ అభిమానిని అని చెప్పుకుంటున్న వాణ్ణి! అందు లోనూ తెలుగుదేశంనుండీ వచ్చిన వాణ్ణి! ఒక్క మాటతో చిన్న కోరికను కొట్టిపారేస్తారా? మీరు చాలా నిర్దయులు!" జాలిగా ముఖం పెట్టాడు శ్రీకాంత్.

తలెత్తిచూసి ఏమనుకుందో ఏమో "సారీ!" అంది శరత్ రేఖ ... తిరిగి తనే "కేంటీన్‌కు వెళ్ళే అలవాటు లేదు నాకు. ఇక్కడికే కాఫీ తెప్పించు

## జాతికి జాగృతి?

చంచల లక్ష్ముల కచకుచ వైశాల్యం వీక్షిస్తూ
వెర్రెక్కి పోయే జాతికి జాగృతి ఎక్కడిది?
జారులు తీరిన బీరులో దూరే నర మాంసపు
ఉక్తి దారులకు భవితవ్యపు దారేది?
సెక్సు కోసం కళ్ళూ, ఒళ్ళూ కాయలు కాయించుకునే
ప్రేక్షక, శ్రోతల ప్రగతి పథాలకు చోటేదీ?
సావాసా కోసం పక్క వాణ్ణి పొడిచి పాతేసే
పాపిష్ఠి కాముల సమాజానికి వెలగల సంస్కృతి మరి ఏదీ?
సెక్సూ, సారా, నేరం నేడు త్రివేణీ సంగమాలుగా
వర్తమాన భారత సంద్రంలో భాగ్యామృతోదయ మేదీ?
భారతాంబ హృదంతరం నుండి నిరంతరం
కారే కన్నీటికి కరకట్ట ఏదీ! ఈ ఆటకు విడు పేదీ?

– సుచంద్ర

కొంటుంటాను! మీరు ఈవేళ నా గెస్ట్! పది నిమిషాల్లో కాఫీ బ్రేక్ ఉంది! ఇలా కూర్చోండి!'' అంటి వాచికేసి చూస్తూ నవ్వును ఆపుకుందుకు ప్రయత్నిస్తూ.

''మగాడిపై దెబ్బ తీయడం మీ ఆడవారికే చెల్లు! లేకపోతే నేను ఇన్వైట్ చేస్తే కాదని మీరు ఇన్వైట్ చేస్తున్నారు. ఎనీవే! ఐ అప్రీషియేట్ దట్ వెరీ మచ్!'' అంటూ కుర్చీలో కూర్చున్నాడు బుద్ధిగా.

నవ్వును పెదిమల మధ్యనే బిగించేసింది శరత్‌రేఖ.

''ఈ మధ్యకాలంలో ''ప్లే'' మళ్ళీ 'ఎస్ ఆక్ట్' చేశారా?'' శరత్‌రేఖ కళ్ళల్లో కళ్ళుంచాడు శ్రీకాంత్.

''లేదు! అయినా మీ కా డాన్స్ డ్రామా అంటే ఎందుకంత అభిమానం?'' సూటిగా చూచిందాతడి ముఖంలోకి.

ఆ తేనె రంగు కళ్ళలో ఏదో వెదుక్కునేందుకు ప్రయత్నిస్తూ—''అదే చెప్పలేకున్నాను! కొన్ని విషయాలను ఎక్స్‌ప్లెయిన్ చేయడం చేతకాదు!'' భుజా లెగరేశాడు.

''కబుర్లు బాగా వచ్చల్లే ఉంది!'' మెల్మదిగా గొణుక్కుంది.

''మీరేదో తిట్టేస్తున్నారు?''

''నో! నో! '' అంది నవ్వేస్తూ.

ఎంత హాయిగా ఉందా నవ్వు? మనసులోనే అభినందించాడు.

అలా మొదలైన వారి పరిచయం రోజు రోజుకూ ఆకులు తొడిగి రెమ్మలైంది.

రోజూ కాస్సేపలా పార్కు వైపో షాపింగ్ సెంటర్ వైపో, ఏదీ లేకపోతే హోటల్లోనో, కేంటీన్‌లోనో కూచుని కబుర్లు చెప్పుకునే వారు. ఆ కబుర్లన్నీ కేవలం ఉబుసుపోక కబుర్లు! కాలేజీలు, సినిమాలు! స్నేహితులు. రాజకీయాలు!

రోజులు తరిగి పోతున్నాయి. తను హైదరాబాదు వెళ్ళాల్సిన రోజు దగ్గిర పడుతూంది.

ఆ రోజు లాల్‌బాగ్, గ్లాస్ హౌస్ సమీపంలో గల లాన్స్‌లో సుఖాసీను లయ్యారు శ్రీకాంత్, శరత్‌రేఖలు.

పిల్లతెమ్మెరలు గిలిగింతలు పెడ్తున్నాయి. పుష్ప సౌరభాలు చుట్టు ముట్టి తన్మయులను గావిస్తున్నాయి. ఆకాశం నిర్మలంగానూ, వాతావరణం ఆహ్లాదంగానూ ఉంది. ఎక్కడ చూచినా వినోద యాత్రికులతోటీ, ప్రేమికుల జంటలతోటీ కలకల లాడుతూంది లాల్‌బాగ్.

పచ్చటి తివాచీ లాటి లాన్‌లో అక్కడక్కడ పువ్వులున్న వాయిల్ చీర, మేచింగ్ బ్లౌజు ధరించి అతి సామాన్యంగా ముస్తాబయిన శరత్‌రేఖ. పక్కనే హేండ్‌బాగ్ ఉంచుకుని కాస్త బిడియంగా ఒదిగి కూర్చుంది.

శ్రీకాంత్ బ్లూ హాప్ స్లాక్, వైటు పేంటు ధరించి, రెండు చేతుల మీద వెనక్కు వాలి రిలాక్స్ అయి కూర్చున్నాడు. ఆ సుందర మనోహర సాయంత్రపు వేళ ఇద్దరి మధ్యా మాటలు కరువయ్యాయి.

''రేఖా!'' తొలిసారిగా ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలిచాడు శ్రీకాంత్.

కళ్ళు విస్ఫారితాలు కాగా తలెత్తి అతడి వంక చూసింది శరత్‌రేఖ.

అతడి కళ్ళలో ఏదో చెప్పాలనే తపన! ''రెండు మూడు రోజుల్లో నేను వెళ్ళి పోవాలి!''

కళ్ళు వాల్చుకుంది రేఖ.

'నన్ను క్షమించు. ఏకవచన ప్రయోగానికి. చూచినక్షణం నుండీ నీవు నా స్వంత మన్న భావన నాలో పాతుకుపోయింది. ఆ భావన నిజంకావాలంటే నీ ఆమోదం కావాలి. రేఖా! చెప్పు. జీవితంలో నా సహచరిగా నా చేతిలో చేయి కలిపి పయనించగలవా?'' కాస్త ముందుకు వంగి ఆమె చేయి మృదువుగా తాకాడు శ్రీకాంత్.

చేయి మృదువుగా వెనక్కు లాక్కుంటూ కళ్ళెత్తి అతడి ముఖంలోకి చూచి తల దించుకుంది ... ఆమె పెదిమలపైన సన్నని హాస రేఖ! ... త్వరత్వరగా కదలి వెళ్తున్న భావ పరంపర ...! దీర్ఘంగా నిట్టూర్చి— ''శ్రీకాంత్ గారూ! ... మీ స్నేహమాధుర్యంలో కొంత హాయిగా రోజులు గడిచిపోయాయి! ... అ మాట చెప్పకుందుకు సిగ్గుపడను! ....కానీ ... నా గురించి మీ కేమీ తెలియదు! ... తెలిసిన నాడు మీరీ విధంగా కోరిక వెల్లడించరు. లోగడ మీలాగే చాలామంది నోట నీ న్నాని మాట! ... తీరా అసలు విషయం తెలిశాక .... చాటు చేశారు ముఖా లని .... దాపరికమెందుకు ... నేను ... వితంతువును! ... జీవితాన్ని చవి చూచిన అభాగ్య రాలను! .... ఇప్పుడు చెప్పండి! ...'' ఇంకా పెళ్ళి చేసుకోవాలనే అనుకుంటున్నారా అన్నట్టున్నాయి ఆ అమ్మాయి చూపులు.

వస్తున్న నవ్వును ఆపుకుంటూ—''మై డియర్ రేఖా! ... నీ గురించి నాకంతా తెలుసు! ... ఆ విషయంలో తర్జన భర్జనలు అనవసరం! నాకు కావలసిందల్లా నీ ఆమోద ముద్ర! ...''ఆమె చెయిని తన గుప్పెటలో ఇముడ్చుకున్నాడు శ్రీ కాంత్.

''నేను జీవితంలో అన్నీ అనుభవించి అలసి పోయిన వ్యక్తిని! పైగా తల్లి, పెళ్ళి కావలసిన చెల్లి బాధ్యతా ఉంది ... మీరింకా జీవితపు తొలిమెట్టులోనైనా అడుగుపెట్టలేదు.! ....స్వార్థ పూరితురాలిని కాలేను! ... దయ ఉంచి ఆ విషయం మరిచి పొండి! ...'' అంది నిక్కచ్చిగా శరత్‌రేఖ.

''అసంభవం! ఏదీ ... ఇలా నా కళ్ళలోకి చూచి చెప్పు!' ... చుబుకం పట్టిలేవనెత్తాడు.

''చెప్పగలను శ్రీ కాంత్‌గారూ! ఇది ప్రపంచం! ... మనుష్యులకు సవాలక్ష కోరికలు! మరింకెన్నో ఆశలు, ఆశయాలు ఉంటాయి. అవన్నీ నేరవేరవు! ... వితంతువును వివాహం చేసుకోవడం కథల్లో, నవలల్లో, నాటికల్లో జరుగుతుంది. నిజజీవితంలో అది అంత సులభమైంది కాదు! ... మీరు ఆదర్శం కోసమో, నా మీద జాలిచేతో ఈ నిర్ణయానికి రావచ్చు! ... అంత మాత్రాన నేను స్వార్థంతో ప్రవర్తించలేను! .. మీరు ...నాకున్న ఒక్కగానొక్క మంచి స్నేహితులు. ఈ స్నేహ పరిమళాన్ని ఇలా గుండెల్లో జీవితాంతం పదిలంగా కాపాడుకోగలను! ... కాని


## మీకుపయోగించే మంచి పుస్తకాలు

1. ద్రైవదర్శిని:- ద్రైవాన్నిపొందిన 59 మంది సిద్ధులు, మనబాధల విముక్తికి, జీవితసుఖాలకు తెల్పినద్రైవ రహస్యాలు. ధర రూ. 10.
2. మానసికశక్తులు:- మనలో మరుగుపడిన ఆకర్షణశక్తి, దివ్యదృష్టి, సమ్మోహన, మెస్మరిజం సులువుగా నేర్చుకొనే పద్ధతులు. రూ. 5.
3. మంత్రశక్తి:- మంత్రాలను గరించిన అనేక అద్భుత మహిమలు, వాటిని సులువుగా నేర్చుకొనే సాధన మార్గాలు. రూ. 5.
4. మీ స్వప్నఫలితాలు:- జరగబోయేవి కలల్లో సాంకేతికంగా కనబడతాయి. ఇది ఆఫలితాలను తెల్పే స్వప్నాల డిక్షనరీ. రూ. 5.
5. చేతిపనులు:- పర్దాకు, సంపాదనకు, నిత్యజీవితానికి ఉపయోగించే ఎన్నో రకాలు సులభంగా చేసుకొనే పద్ధతులు. రూ. 5.
6. వ్యవహారదర్శిని:- వివిధ నిత్యవ్యవహార జాగ్రత్తలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, వ్రాసేపద్ధతులు, నమూనాలు వగైరా. రూ. 10.
7. అద్భుత హాస్యకథలు:- మీరుకులాసాగా నవ్వటానికీ, ఇతరులను నవ్వించి ఆకర్షించుటకు అనేక చిన్నహాస్యకథలున్నాయి. రూ. 5.
8. జీవితరహస్యాలు:- మీ దాంపత్యజీవితాన్ని పరిపూర్ణ ఆనందమయంగా మార్చే అనేక దివ్యకామసూత్రాలు. రూ. 5.
9. యువతి:- స్త్రీల సంసారజీవితాన్ని సుఖంగా మార్చే అతికుతూహలమైన వారిప్రత్యేక కామసూత్రాలు. వెల రూ. 5.
10. సంతానము:- కామసుఖాలు అనుభవించుచుకూడ అవసరంలేనపుడు గర్భంరాకుండా 70 నవీనమార్గాలు. ధర రూ. 5.
11. రసికప్రియ కథలు:- చదివిన కొలది చదవాలనిపించే, అతి ఆనందదాయకమైన అనేక వినోద శృంగార కథలు. రూ. 5.
12. విద్యుద్వైద్య విధానాలు:- అన్నిరకాల రోగాలకు రోగలక్షణాలు, వాటినివారణకు ఐదురకాల ప్రఖ్యాతవైద్యులు చెప్పిన, ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, యునాని, హోమియో మందులు. వాటిని వాడే విధానాలు. అవసరానికి ఆదుకొనే ఇది మీ ఇంటి డాక్టరు. రూ. 16.
13. ఆహారవైద్యము:- మన ఆహారాలలో మందులుపుష్కలంగావున్నాయి. ఏరోగానికేమి తినాలో తెలిపే ఆహారవైద్య విధానాలు. ధర రూ. 10.
14. మూలికావైద్యము:- ఇంట్లో దొరికే మిరియాలు, జీలకర్ర, అల్లం, వెల్లుల్లి వగైరా మూలికలతో వివిధరోగాల సులభవైద్య విధానాలు. రూ. 10.

రూ. 20 ఆపైవిలువ ఆర్డర్లకు వి.పి. పోస్టుఖర్చులు ఉచితం. అంతకన్నా తక్కువ ఆర్డర్లకు పోస్టుఖర్చు రూ. 4, అదనము. దేశసేవా ప్రచురణాలు, 5/3 ఆర్టీసీ, పంజాగుట్ట కాలనీ, హైదరాబాదు-4 కు ఉత్తరం వ్రాస్తే మీకు కావలసినపుస్తకాలు వి.పి. పోస్టుద్వారా పంపబడును. మర్చిపోకుండా మీక్కావలసినపుస్తకాలకు వెంటనే వ్రాయండి.

పనులకు ఆలోచన లేందుకు! . . . లేవండిక" అంది పాదాల మీద కుచ్చెళ్ళు సవరించుకుంటూ రేఖ.

"జాలితో నీ జీవితాన్ని సరిదిద్దుదామనీ గానీ ఆదర్శం పేరిట సంఘంలో నా ఇమేజి పెంచుకోవాలనీ కానీ కాదు! . . ." గంభీరంగా వెలువడ్డాయి పలుకులు

"మరైతే? . . . .త్యాగమా? . . ." కళ్ళు తాటించింది.

"కాదు స్వార్థం !" టక్కున బదులిచ్చాడు.

"ఇంత కాలం ఎదురు చూచిన వ్యక్తి నీవేనని తొలి చూపులో గ్రహించాను! నాకు కావలసింది ఈ శరత్ రేఖ కానీ . . . మరే ఇతర అమ్మాయి కాదు. నా ఆశయాలకూ అభిరుచికి తగ్గ అమ్మాయిని ఎన్నుకోవడం స్వార్థం కాదూ? అందుకే మరో మారు ఆలోచించుకొమని కోరుకుంటున్నాను! పెద్ద వాళ్ళు నా విషయంలో అడ్డు చెప్పరు! నాకు కావలసింది . . .నీ . . . అంగీకారం!"

ఆ తరవాత శరత్ రేఖ ఆతడితో వాదించి అలసి పోయిందే కానీ శ్రీకాంత్ తనపట్టు సడలించ లేదు.

"ఆల్ రైట్ శ్రీ కాంత్ జీ! . ఒక్క షరతు—ఒక ఏడాది తరవాత కూడా మీ కిదే అభిప్రాయం ఉంటే తప్పకుండా నేనంగీకరిస్తాను! ..." అంది రాజీ బేరానికన్నట్టు . . . శరత్ రేఖ . . .

"షూర్! . . . .షూర్! . . . ఏడాది కాదు కదా నీవు ఐదేళ్ళు ఓపికపట్టమన్నా పట్టగలను! ..." సంతోషంగా ఆమె చేయి నొక్కాడు.

గుంభనంగా నవ్వుకుంది శరత్ రేఖ . . . ఏడాదిలోగా పెద్దవాళ్ళు మెడలు వంచి పెళ్ళి చేయకపోతారా? అన్న ధీమాతో చూచిందాతడి వంక.

రోజులు చకచకా దొర్లాయి . . . ఋతువులు మారాయి . . . మనుష్యుల దైనందిన చర్యల్లో బోలెడన్ని మార్పులు! . . . రాజకీయాల్లో మార్పులు! . . . ఆకాశాన్ని తలదన్నే నిత్యావసర వస్తువుల ధరలు . . . ఎక్కడికక్కడ సతమత మయ్యే సామాన్యుని జీవిత గమనం! . . .

విదేశంలో మంచి ఉద్యోగం చేస్తున్న ఒక స్వదేశీ సంబంధం రావడంతో చెల్లి పెళ్ళి చేసి చేతులు దులుపుకుంది శరత్ రేఖ.

కొద్ది రోజులు నెలలు దాకా అప్పుడప్పుడు శ్రీకాంత్ గుర్తొచ్చేవాడు. ఆ తరవాత ఆ విషయంగూర్చి మర్చిపోయింది.

ఇన్స్టిట్యూటులో ఏదో సెమినారు ఉండడంతో వూపిరి సలపనంత పనిలో సతమతమై ఉంది రేఖ.

మనసు విసిగ్గా ఉన్న శరీరం అలసిపోయినా పీటునంటిపెట్టుకున్నంత వరకూ చిరునవ్వు పులుము కుని చలాకీగా ఉండక తప్పడం లేదు.

వూపిరి సలపకుండా ఫోన్ కాల్స్, ఎన్ క్వయరీలు ఎదురుగా నుంచున్న వ్యక్తులెవరనే ధ్యాసలేదు.

టైమ్ చూచుకుంది. కాఫీ బ్రేక్! లేవ డానికి ఉపక్రమిస్తుండగా—

ఒక పురుషుడు పక్కనే అందమైన నాజూకైన యువతి, వచ్చి నుంచున్నారు . . . విసుగుదల అణచుకొంటున్నా పైకి చిరునవ్వుతో "మె ఐ హెల్ప్ యూ" అంది . . . రేఖ . . . .

"గుడ్ డే . . . మిస్! . . ." పలుకరింపుకు తలెత్తి చూచింది.

నాపలు మెలి తిప్పిన ఒత్తయిన మీస కట్టు, సైడ్ బర్న్స్! ఉంగరాల జుట్టు . . . కళ్ళు క్రిందకు వాల్చుకుని "వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" అంది రేఖ . . . .

"ఐ . . యామ్ డాక్టర్ శ్రీ కాంత్ ఫ్రమ్ హైద్రాబాద్! . . షి ఈజ డాక్టర్ . . ."

కళ్ళెత్తి చూచింది శరత్ రేఖ . . .అతడి కళ్ళు నవ్వుతున్నాయి. ఆ నవ్వుకు అర్థం . . . బోధపడలేదు . . .అసలా విషయాన్ని ఆలోచించే అవసరం కూడా అనిపించలేదు . . . .

మిసెస్ శ్రీ కాంత్ కాబోలు అనుకుంది విర్లిప్తంగా రేఖ . .

రేఖ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ . .

"డాక్టర్ . . . మిస్ . . . వనిత . . . ఫ్రమ్ హైద్రాబాద్!" .. నొక్కి పలికాడు . . ."మిస్" . . . అన్న పదాన్ని . . .

డెలిగేట్స్ హాస్టల్ వివరాలు అడిగి "లెటస్ గో డాక్టర్" అని వనితను అనుసరించి పదడుగులువేసి వేసి . . . . గబగబా . . . . వెనుదిరిగివచ్చి . . .

కొంటెగా కన్ను గిలిగి . . . ఉడికించే చిరునవ్వుతో కాస్త ముందుకు వంగి . . .

"మై డియర్ గర్ల్! . . . వచ్చేశా బైదిబై నీవు పెట్టిన గడువు తీరిపోయింది . . . ఎలా కాదంటావో ఈసారి నేను చూస్తా . . . అన్నట్టు - ఇందాకా మే ఐ హెల్ప్ యూ అన్నావు . . . ఆ ప్రశ్నకు . . . సమాధానం ఎక్కడ, ఎలా రాబట్టాలో త్వరలోనే చెబుతా! మళ్ళీ కలుస్తా! బై బై . . ." చేయివూపి పరుగులాటి నడకతో వనితను కలుసుకోబోయిన శ్రీ కాంత్ వైపు అనురాగం నిండిన కళ్ళతో చూస్తుండిపోయింది శరత్ రేఖ. ఆమె హృదయంలో రాగవిపంచి విచిత్రనాదాలు వినిపించింది. ★

# అగ్ని గర్భ

సముద్రంలో అగ్ని బడబాగ్ని
అడవిలో అగ్ని దావాగ్ని
ఈ రెంటిని క్షీరం చేసుకోగల అగ్ని
మానవుని కడుపులో జఠరాగ్ని!
ఆకలి పర్వతం పగిలితే
జఠరాగ్ని రగిలితే—
సముద్రాలు బల్లబడతాయి
అడవి కళ్ళు పచ్చబడతాయి!
ఊపిరికి రగిలే జఠరాగ్ని కి
రెండు జ్వాలికలు-రెండు కళ్ళు!
అవి వెలుగును తింటాయి
వెలుగుతూ ఉంటాయి
అవి కాంతిలేని ఖరీదైన కళ్ళల్లోకి
సముద్రాల్ని పుక్కిలించి ఉమిసేస్తాయి
ఆ సముద్రాల కౌగిళ్ళలో
అరణ్యాల్ని సృష్టిస్తాయి
రెప్పలు లేని ఆ కళ్ళు—
ఆ - కళ్ళు
దేశానికి, ప్రగతికి
రెప్పల్లాంటి పల్లెటూళ్ళ వాకిళ్ళు!!

- ఆచార్య తిరుమల

సత్యాన్ని ప్రవచించడంతప్ప మరో ఆశయం లేనివాడు — చిన్న పరిధిలో అనంతంగా బోధలు మాత్రం చేయగలడు. అతను ఆచరించేది శూన్యం.

—స్టీల్